క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బాలుడు లోక్‌చంద్(7) అనారోగ్యానికి గురై ఐదేళ్లుగా కోలుకోలేకపోతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 'వి షల్ ఓవర్ కం' ట్రస్టు ద్వారా శనివారం జిల్లా కేంద్రంలో ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో రూ.25వేల చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఐదేళ్లుగా బాలుడికి కుటుంబసభ్యులు పలు రకాల వైద్య పరీక్షలు చేయించినా పూర్తిగా కోలుకోలేదు. దీంతో వీపనగండ్ల ఎస్ఐ కె రాణి ట్రస్టు సభ్యులకు ఈ విషయం చెప్పారు. దీంతో స్పందించిన ట్రస్టు సెక్రటరీ ఎస్పీ సతీమణి అపర్ణ నిధులు సమకూర్చారు. సమకూర్చిన రూ.25వేల చెక్కును ఎస్పీ సమక్షంలో బాలుడి తల్లి అన్నపూర్ణకు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాణి, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



మదనాపురం: మండలంలోని తిర్మలయపల్లిలో శనివారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. బొగ్గు చిన్న బుర్రన్న, శ్రీను పశువులు, గేదెలు మేత కోసం 15 ఎకరాల గడ్డిని నిల్వ చేశారు. మధ్యాహ్నం గడ్డివాము నుంచి ఆకస్మిత్తుగా మంటలు రావడాన్ని గ్రామస్తులు గుర్తించి, వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది దేవేందర్‌రెడ్డి, శివప్రసాద్, ఉదయ్‌కుమార్, బాలరాజు ఉన్నారు.

మెస్‌చార్జీలు పెరగడంతో విద్యార్థుల ఆనందం



వనపర్తి విద్యావిభాగం: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు డైట్, మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా వివిధ హాస్టళ్లలో అధికారులు న్యూ డైట్ ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వనపర్తిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో వనపర్తి జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఐఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా డీఎఫ్ఓ తిరుమలరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



వనపర్తి టౌన్: పట్టణ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వాముల అయ్యప్పనామస్మరణంతో ఆలయం మార్మోగింది. ఇరుముడి కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విచ్చేసి స్వాములకు సాధారంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఇరుముడి కట్టుకుంటున్న ముత్తుకృష్ణ గురుస్వామిని సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వాకిటి శ్రీధర్, బీచుపల్లి యాదవ్, నందిమల్ల అశోక్, గట్టు యాదవ్, నాగన్న యాదవ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

వనపర్తి రూరల్: పేద విద్యార్థుల చదువుకు వారి సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆర్‌డీఓ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని చిట్యాల శివారులోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో హెచ్‌ఎం గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీఓ, డీసీఓ మేగారావు హాజరయ్యారు. ప్రభుత్వం విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచారని, కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వారికి సూచించారు. అనంతరం పెంచిన కొత్త డైట్ చార్జీల చాటును విడుదల చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం

గోపాల్‌పేట: ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెడుతున్నారని, భయపడకుండా తినొచ్చని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రలోని ఎస్సీ, బీసీ, బాలికల హాస్టళ్లను నాయకులు, అధికారులు సందర్శించారు. నాయకులు, మండల అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. బీసీ హాస్టల్ నిర్మాణం కోసం బిల్డింగ్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ శివన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొంకి వెంకటేష్, జిల్లా ఆర్టీఏ చైర్మన్ కొంకి రమేష్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, వెంకటయ్య, ఎండీ బాలపీరు, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సంబరాలు

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో వసతులు కల్పిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో మండల కేంద్రం పాన్‌గల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నిర్వహించిన సంబరాలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం కోసం మెస్ చార్జీలు, వ్యక్తిగత పరిశుభ్రత కోసం కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీఆర్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి అన్నారు. విద్యార్థులకు లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మండల స్థాయి అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిట్యాల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్రమణ్యం

ప్రభుత్వ బాలికల హాస్టల్ పరిశీలన

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లలో విద్యార్థులకు డైట్ మెనూ, కాస్మొటిక్ చార్జీలు పెంచడంతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం పెంచిన మెస్, కాస్మొటిక్ చార్జీలపై వివరించారు. అనంతరం విద్యార్థినులు, తల్లిదండ్రులతో కలిసి సహపక్తి భోజనం చేశారు. సమావేశంలో హెచ్‌డబ్ల్యూఓ జ్యోతి, ఆర్‌యు.వాసు, ప్రజాప్రతినిధులు శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీను, పి.కృష్ణారెడ్డి, గోకరన్న, యాదయ్యసాగర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చదువు ద్వారానే జీవితానికి వెలుగు

మదనాపురం: చదువు ద్వారానే జీవితంలో దేనినైన సాధించవచ్చని, విద్యార్థుల కోసం అన్ని రకాల వసతులను ప్రభుత్వం సమకూర్చుతోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ సూచించారు. మదనాపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు. తహసీల్దార్ అబ్రహం లింకన్ విద్యార్థులకు చదువుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



వీపనగండ్ల ఎస్సీ బాలుర గురుకులలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అధికారులు

విద్యార్థులు ఆరోగ్యం, విద్యలో ముందుండాలి

కొత్తకోట రూరల్: గురుకుల, వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని వీపనగండ్ల తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. కొత్తకోట పట్టణ సమీపంలోని వీపనగండ్ల ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను ఆమె ప్రిన్సిపల్ సాయిరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మెస్ చార్జీల పెంపు నూతన డైట్ మెనూను ప్రారంభించారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు, తహసీల్దార్, ప్రిన్సిపల్ విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైస్ ప్రిన్సిపల్ యండీ.ఖదీర్‌ఖాన్, శ్రీకాంత్‌గౌడ్, కేర్ టేకర్ రాజేందర్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో..

మెస్ చార్జీల పెంపు సందర్భంగా స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్‌తో కలిసి కొత్తకోట తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌జే.బోయెజ్, పి.కృష్ణారెడ్డి, నరేందర్ రెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డెన్ రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ అని కాంగ్రెస్ ప్రభుత్వం బలంగా నమ్ముతుందని, అందుకే విద్యాభివృద్ధి, బాలల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం బీసీ హాస్టల్‌ను ఎమ్మెల్యే సందర్శించిన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మెస్‌చార్జీలు, కాస్మొటిక్ చార్జీల పెంపుతో విద్యార్థులకు అసౌకర్యాలు తొలగిపోయాయన్నారు. నాల్గవ తరగతి నుంచి పీజీ వరకు ఒకేచోట విద్యనభ్యసించే విధంగా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామ పరిధిలోని బీసీ గురుకులం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, కౌన్సిలర్లు, పెద్దమందడి, వనపర్తి నాయకులు పాల్గొన్నారు.



పాన్‌గల్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న అధికారులు, నాయకులు



మదనాపురం గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న తహసీల్దార్ అబ్రహం లింకన్



గోపాల్‌పేట హాస్టల్‌ను సందర్శించిన అధికారులు, నాయకులు



మదనాపురంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్



ఖిల్లాఘనపురం ఎస్సీ వసతి గృహంలో మాట్లాడుతున్న అధికారులు

రాజీమార్గమే రాజమార్గం



ఆత్మకూర్ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి వై జానకి

● న్యాయమూర్తి వై జానకి

ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని మున్సిఫ్ మ్యాజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన మెగాలోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వై జానకి మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్షణికావేశానికి గురై కేసులు పెట్టుకొని, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల ఎంతో విలువైన సమయం వృథా అవుతుందని, రాజీమార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల క్రిమినల్ కేసులు, డ్రంకెన్‌డ్రైవ్, ఇతర పోలీస్ కేసుల ద్వారా రూ.3.30 లక్షల జరిమానా విధించగా, మొత్తం 1060 కేసులు పరిష్కరించి కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు దివాన్జీ అశోక్‌రావ్, విజయభాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు వై తిప్పారెడ్డి, జీకే రాములు, నారాయణగౌడ్, రామేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, బీవీ రత్నం, ముక్తేశ్వర్, శంకర్‌లింగం, ఏపీ రాజేందర్, కృష్ణ, కిషోర్, విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, అబ్రహం, మన్యం, వినోద్, వర్కటం శ్రీనివాస్‌రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది, ఆయా మండలాల పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పరీక్షలకు సిద్ధం కావాలి

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా వార్షిక పరీక్షలకు సిద్ధమవుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, మల్లేష్‌కుమార్, అక్బర్ సూచించారు. శనివారం మండలంలోని గోప్లాపూర్, అన్నారం, అన్నారంతండా గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థుల ఇళ్లను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు ఈ మూడు నెలలు ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంటూ సమయాన్ని కేవలం చదువుకోసమే ఉపయోగించాలన్నారు.



గోప్లాపూర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పరీక్షలకు సంసిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగానే పదో తరగతి విద్యార్థుల ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నెలవారి టీకాలు వేయించుకోవాలి



రంగవరంలో సూచనలిస్తున్న అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు

వీపనగండ్ల: గ్రామాల్లో గర్భిణులు, పసి పిల్లలు క్రమంతప్పకుండా నెలవారి టీకాలు వేయించుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం రంగవరం, కొర్లకుంట, సంపత్‌రావుపల్లి గ్రామాల్లో పలువురికి నెలవారి టీకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు వృథా చేసుకోవద్దని అంగన్‌వాడీ టీచర్‌లు చంద్రకళ, వెంకటేశ్వరమ్మ, ప్రసన్న, ఏఎన్‌ఎం సునంద, ఆశా కార్యకర్త జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, పసి పిల్లలు ఉన్నారు.

గొల్ల, కురుమలు పోరాటానికి సిద్ధం కావాలి

వనపర్తి టౌన్: రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్రంలోని గొల్ల, కురుమల ఓట్లు వేసుకుని గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోవడం లేదని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి.దేవేందర్ పేర్కొన్నారు. ఈనెల 16న గొల్ల, కురుమల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు గొల్ల, కురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. గొల్ల, కురుమలు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 16న రాష్ట్ర రాజధానిలోని ఇందిరాపార్క్ దగ్గర ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాలుతున్న మామిడి పూత

● ఆందోళనలో రైతులు



వీపనగండ్ల: రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి మామిడి తోటలు సాగు చేస్తుండగా, దాదాపు 70 శాతం తోటల్లో ఇప్పటికీ పూత రాలేదు. వచ్చిన కొద్దిపాటి పూత నల్లబారి రాలుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పూత వచ్చేందుకు ఎన్నో రకాల మందులు పిచికారీ చేసినా, సకాలంలో పూత రావడం లేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. సైంటిస్టులు, ఉద్యానవన అధికారులు స్పందించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పిల్లల భవిత కోసమే సత్యశోధన పాదయాత్ర



పాన్‌గల్: పిల్లల భవిత కోసమే బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా.శివార్చక విజయ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 100 రోజులు 1000 కిలోమీటర్లలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కవి నందిగామ కిశోర్, సుంకరి బసవరాజప్ప, ఉపాధ్యాయులు హైమద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పిస్తున్నాం



ఆత్మకూర్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, సదుపాయాలు కల్పిస్తున్నామని, సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూర్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహం, బీసీ బాలుర వసతి గృహాల్లో ఎమ్మెల్యే సందర్శించి భోజనం, సౌకర్యాలను పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి 40 శాతం అదనంగా మెస్‌చార్జీలు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషa, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఛైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వార్డెన్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ సాధిస్తా..

గత వైభోవం కోల్పోయిన ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. అఖిలపక్షం, రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో వందలాదిమంది మక్తల్ ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్షం, రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులతో సమావేశమయ్యారు. నారాయణపేట జిల్లాలోని మక్తల్, వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించానని, అందుకు సీఎం సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, డివిజన్ సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

అమరచింత: గురుకులాలు, వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు మెచ్చుకులా ఉన్నత లక్ష్యాలు సాధించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌సీ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. రాష్ట్రం మొత్తం వసతి గృహాల్లో 16 లక్షల మంది విద్యార్థులకు రూ.470 కోట్లు సీఎం విడుదల చేశారన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ డీపీఓ సురేష్ కుమార్, వార్డెన్ చంద్రన్, ఎంపీఓ నరసింహులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

సహాయం చేసే గుణం ఉండాలి

ప్రతి ఒక్కరు సేవ గుణం కలిగి ఉన్నప్పుడే తమ గొప్పతనం గురించి ఇతరులు ఆలోచించే స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు వైడూర్య, ఆదాంలు క్రిస్మస్ సందర్భంగా పాస్టర్‌లు నిరుపేదలకు నూతన వస్త్రాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే ఆయా మండలాలకు చెందిన పలువురు పాస్టర్‌లు, వితంతువులు, నిరుపేద మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ దంపతులతో పాటు ఎంబీకర్మెల్ చర్చి పీల్డ్ చైర్మన్ లూథర్, పాస్టర్ హ్యాపీపాల్, కాంగ్రెస్ నాయకులు ఆయూబ్‌ఖాన్, అరుణ్ కుమార్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

అమరచింత: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీజేపీ నూతన బూత్ కమిటీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన బూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లప్పుడు బూత్ పరిధిలో ఉన్న కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, ఉట్కూర్ భాస్కర్, మేర్వరాజు, అశోక్ కుమార్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: అమలుకాని హామీలతో రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆత్మకూర్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలందరు సమాయత్తం కావాలని దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, అశ్విన్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాము, ఆంజనేయులు, రాజు, అశోక్, ఎల్లన్న ఉన్నారు.



బూత్ కమిటీ సభ్యులతో బీజేపీ మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

వైభవంగా దత్తాత్రేయస్వామి డోలారోహణం

నారాయణపేట రూరల్: పట్టణంలోని సద్గురు అవధూత నర్సింహస్వామి మఠంలో శనివారం దత్త జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, పాదపూజ, బిల్వార్చన, అష్టోత్తరనియామవళి, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, యజ్ఞం తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళల జ్యోల పాటలతో బాజాభజంత్రీలతో స్వామివారి డోలారోహణం నిర్వహించారు. అనంతరం నైవేద్యం మహామంగళహారతి చేసి భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం నిర్వహించారు. మఠం అభివృద్ధికి ఆర్థిక సాయం అందించిన విశ్రాంత ఉపాధ్యాయులు సుజాత, వైద్యులు గీత విశ్వనథ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మఠం కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి డోలారోహణంలో పాల్గొన్న మహిళలు